క్లుప్తంగా

పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ



పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

పులిచెర్ల(కల్లూరు): చిత్తూరు జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి బుధవారం కల్లూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు క్రైం నంబర్లు వేయాలని ఆదేశించారు. స్టేషన్‌ను శుభ్రంగా ఉంచారని అభినందించారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసమూర్తి, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరానికి స్పందన



దూడలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న పశు వైద్యాధికారి చందనప్రియ

సోమల: మండలంలోని నంజంపేట పంచాయతీ సరస్వతీపురంలో బుధవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. పశువులకు పశు వైద్యాధికారి డాక్టర్ చందనప్రియ వైద్య పరీక్షలు చేశారు. పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. అలాగే63 పశువులకు పిడుదుల నివారణ మందు, 15 దూడలకు నట్టల నివారణ మందులు తాపించారు. కార్యక్రమంలో వీఎల్ఓ నరసింహారెడ్డి, ఏఎహెచ్ఏలు నూర్ మహమ్మద్ ఆలీ, సిబ్బంది రవితేజ, మధు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ గిరిరాజారెడ్డి

గంగవరం: ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త పింఛన్లను మండలంలోని కొత్తపల్లెలో సర్పంచ్ గిరిరాజారెడ్డి, నాయకులు, సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేశారు. సచివాలయ పరిధిలోని గ్రామాల్లో వృద్ధాప్య 10, వితంతు3, వికలాంగ 2 చొప్పున పింఛన్లు మంజూరు చేశారని సర్పంచ్ చెప్పారు. ఎవరి సిఫార్సులూ లేకుండా తమ ప్రభుత్వం అర్హులకు పింఛన్లు ఇస్తోందన్నారు. ఇదే టీడీపీ పాలనలో ఇలా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు చిట్టి, శివన్న, రమణారెడ్డి, బాబు, విజయ్, భాస్కర్‌రెడ్డి, యువరాజు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

అందుబాటులో ఉన్నాం.. ఆదరించండి

- ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు
- ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్



లబ్ధిదారులకు సంక్షేమ బావుటా బుక్‌లెట్ ఇస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

కుప్పం: అందరికీ అందుబాటులో ఉన్నాం...ఆదరించాలని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ ప్రజలను కోరారు. బుధవారం కుప్పం మున్సిపాలిటీ 4వ వార్డులోని కమతమూరు, కత్తిమానుపల్లె, గుండ్లపల్లె, కత్తిమానుపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్సీ భరత్ ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. సంక్షేమ పథకాల లబ్ధి ఎవరికెంత చేకూరిందో బుక్‌లెట్లతో వివరించారు. అర్హులైనప్పటికీ సాంకేతిక కారణాలతో పథకాల ఫలాలు పొందలేని వారు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయిస్తామన్నారు. కులమతాలు, పార్టీలకతీతంగా అర్హులైన వారికి ఇళ్ల ముంగిటకే పథకాలు ఫలాలను తమ ప్రభుత్వం అందిస్తోందని, తమ పార్టీని రానున్న ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు.

ఎమ్మెల్సీ దృష్టికి 30 ఏళ్ల సమస్య

పట్టణానికి కూతవేటు దూరంలో తాము ఉన్నా గుల్లెపల్లె, కుప్పంకు వచ్చే మార్గంలో మధ్య కాలువ ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్సీకి కమతమూరు మహిళలు సమస్యలు నివేదించారు. ఈ కాలువలో చెరువు నీరు కాకుండా పట్టణం నుంచి మురుగునీరు ప్రవహిస్తోందని, ఆ నీటిలో నడచి వెళ్లాల్సి వస్తోందని నివేదించారు. మురుగు కాలువలు నిర్మించాలని, 30 ఏళ్లుగా ఈ సమస్యలను పట్టించుకున్న నాయకులు లేరని వాపోయారు.

సమస్యలపై స్పందించిన ఎమ్మెల్సీ

కమతమూరు మహిళలు నివేదించిన సమస్యపై ఎమ్మెల్సీ స్పందించారు. గతంలో వేసిన అంచనా మేరకు రూ.16 లక్షలతో కల్వర్టు నిర్మించి, రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామంలో మురుగునీటి కాలువల నిర్మాణానికి అంచనాలు రూపొందించాలన్నారు. కత్తిమానుపల్లె కాలనీలో వర్షాలకు ఉరుస్తున్న ప్రాథమిక పాఠశాలలో నాడు–నేడు కింద మరమ్మతులు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, కమతమూర్ ఇన్‌చార్జి నిత్యానందం, స్థానిక నాయకులు కన్వీనర్ మురుగేష్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాణెమ్మ ఇంట.. సంక్షేమం పంట



ఈమె పేరు రాణెమ్మ. కత్తిమానుపల్లె కాలనీలో నివసిస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల పరంగా నాలుగేళ్ల కాలంలో రూ5.32 లక్షల ఆర్థిక సహాయం అందుకుంది. జగనన్న ఇల్లు, వైఎస్సార్ పింఛనుతో రూ.82 వేలు అందుకుంది. ఆమె ఆనందానికి హద్దుల్లేవు జన్మజన్మలకు జగన్ మోహన్‌రెడ్డిని మరవలేమని, ఆయనకు రుణపడి ఉంటామని ఆమె చెబుతోంది.



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న భరత్

కళ్లద్దాల పంపిణీ

'జగనన్న కంటి వెలుగు' కార్యక్రమంలో ఇటీవల కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు ఉచితంగా కళ్లద్దాలను ఎమ్మెల్సీ పంపిణీ చేశారు. 4వ వార్డులో 120 మంది కంటి రోగులకు ఆయన కళ్లద్దాలు అందజేశారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



నాగిరెడ్డిపల్లెలో లబ్ధిదారులకు బుక్‌లెట్ ఇచ్చి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం.
- ఎమ్మెల్యే వెంకటేగౌడ

బైరెడ్డిపల్లె: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాను పర్యటిస్తున్నట్టు ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ అన్నారు. బైరెడ్డిపల్లె సచివాలయ పరిధిలోని నాగిరెడ్డిపల్లె, మర్రిమానుచేను గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. సమస్యలపై ఆరా తీశారు.

సీసీ రోడ్డు ప్రారంభం

నాగిరెడ్డిపల్లెలో రూ.14లక్షలతో వేసిన సిమెంటు రోడ్డు ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే నెల్లిపట్ల ప్రధాన రహదారి నుంచి మిట్టపల్లె మీదుగా నాగిరెడ్డిపల్లె వరకు రూ.67 లక్షలతో వేయతలపెట్టిన సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పాలనకు దేశమంతటా ప్రశంసలు లభిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వాల హయాంలో ఎన్నడూ చూడని అభివృద్ధి జగనన్న పాలనలో చూశామన్నారు. సంక్షేమ పథకాల అమలు వల్ల రాష్ట్ర ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందని పేర్కొన్నారు. నాలుగేళ్లలో ప్రతి కుటుంబానికి రూ 2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందని చెప్పారు. సంక్షేమ పథకాలతో ప్రజలకు చేకూరుతున్న ప్రయోజనాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులు, రాజంపేట వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సంయుక్త కార్యదర్శి దయానందగౌడు, పార్టీ మండల కన్వీనర్ కార్తీక్, వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, రూప, సర్పంచులు వెంకటేష్, బాలక్రిష్ణగౌడు, రాజప్ప, చంద్రమౌళి, రవికుమార్, ఎంపీటీసీలు జగదీష్, సురేష్, వినాయకం, నాగరాజు, పార్టీ నేతలు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రూట్ ఫీడింగ్‌తో కొబ్బరి చెట్ల సంరక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న డింపు ప్రియ

కుప్పం రూరల్: తెగుళ్లఆశించిన కొబ్బరి చెట్లను రూట్ ఫీడింగ్ (వేరుకు క్రిమి సంహారక మందు కలిపిన నీటిని పట్టించడం)తో సంరక్షించుకోవచ్చని కుప్పం మండల ఉద్యానవనశాఖాధికారి డింపు ప్రియ అన్నారు. తెగుళ్ల ఆశించిన కొబ్బరి చెట్లను కాపాడుకునేందుకు వెండుగంపల్లెలో బుధవారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డింపు ప్రియ మాట్లాడుతూ, కొబ్బరిలో నల్లముట్టి పురుగు ఉధృతి ఎక్కువై, గొంగళి పురుగు దశలో ఉన్నప్పుడు వేరు ద్వారా మోనోక్రోటోఫాస్ 10మి.లీ./10 మి.లీ నీటిని కలిపి పట్టించాలన్నారు. బాగా పోషకాలు తీసుకునే వేరును ×వీ¥ ఆకారంలో పొట్టును చెక్కి, కలుపుకున్న మందును పాలిథిన్ కవర్‌లో పోసి, మందు పీల్చుకోవడానికి అనువుగా వేరును మందులో ముంచి కట్టాలన్నారు. తరువాత 45 రోజుల వరకు కొబ్బరి బోండాలు, కాయలు కోయరాదన్నారు. పురుగు సోకి ఎండిన తోటలకు కిలో యూరియా, 2 కిలోల సూపర్ పాస్పేట్ 2.1/2 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసి నీరు పెడితే ఏడాది తరువాత చెట్లు కోలుకుంటాయని చెప్పారు. కార్యక్రమంలో వీహెచ్ఏ కార్తీక్, మనోజ్, ఏపీఎం మురుగేష్, రైతులు పాల్గొన్నారు.

నియామకం



రామచంద్ర

శాంతిపురం: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శిగా కొలమడుగు పంచాయతీ రామాపురానికి చెందిన రామచంద్ర నియమితులయ్యారు. ఆయనకు జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రామచంద్ర చెప్పారు.

టమాట, వరి రైతులకు అవగాహన

పెద్దపంజాణి: మండలంలోని ఆకులవారిపల్లెలో బుధవారం పుడమి కిసాన్ మార్ట్ (రాయలపేట) అధ్వర్యంలో టమాట, వరి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ, క్రిమి సంహారక మందుల వినియోగం, అధిక దిగుబడికి తీసుకోవాల్సిన చర్యల గురించి జడ్ఎం శ్రీనివాసులు వివరించారు. రైతులు సాగు చేసిన టమాట, వరి పంటలను పరిశీలించి సలహాలు–సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది మనోహర్, నవీన్, రైతులు బయ్యారెడ్డి, సుబ్బారెడ్డి, రామయ్య, నారాయణ రెడ్డి, మార్కొండయ్య, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' సమీక్షకు హాజరు కావాలి

సోమల: వచ్చే నెల 2వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా పోటీల సన్నాహక ఏర్పాట్లపై చిత్తూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించనున్నారని ఎంపీడీఓ నాగరాజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనికి మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలని కోరారు.

తమిళనాడు మంత్రి వ్యాఖ్యలపై ఆగ్రహం

- ఉదయనిధి స్టాలిన్ ఫ్లెక్సీకి చెప్పుల దండ వేసి నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న హిందూ జాగరణ సమితి, బీజేపీ నాయకులు

పుంగనూరు: తమిళనాడు రాష్ట్ర మంత్రి ఉదయానిధి స్టాలిన్ హిందూ సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తగదని నిరసిస్తూ బుధవారం స్థానిక గోకుల్ సర్కిల్‌లో హిందూ జాగరణ సమితి, బీజేపీ నాయకులు ఆందోళన చేశారు. ఉదయనిధి స్టాలిన్ ఫ్లెక్సీకి చెప్పుల దండలు వేసి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిందూ ధర్మాన్ని కాలరాచేలా మాట్లాడితే సహించేది లేదని, ఉదయనిధి స్టాలిన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హిందూ జాగరణ సమితి అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి, బీజేపీ నాయకులు సీఆర్.రాజారెడ్డి, టీవీఎస్.ప్రసాద్, త్రిమూర్తిరెడ్డి , వెంకటేష్, పరమేష్, రాజారెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

పుంగనూరు: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణ గురువారం మధ్యాహ్నం వాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. అక్రమ మద్యం రవాణా కేసుల్లో సీజ్ చేసిన 13 మోటారుసైకిళ్లు, ఒక ఆటోను వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో పెట్టాలి



ఆందోళన చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

పుంగనూరు: ఎస్సీ వర్గీకరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం అత్యవసర పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టాలని ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై బుధవారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఎంఆర్‌పీఎస్ నాయకులతో కలసి ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. అంబేడ్కర్ సామాజిక న్యాయ సిద్ధాంతం ప్రకారం కులాల వారీగా జనాభా దామాషపై రిజర్వేషన్లు కల్పించాలని, బిల్లు ప్రవేశపెట్టాలని లేకపోతే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు వెంకట్రమణ, హరిబాబు, ఆంజప్ప, సుబ్రమణ్యం, సతీష్‌కుమార్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణం వందే జగద్గురుమ్



సోమల: పెద్ద ఉప్పరపల్లెలో..



పుంగనూరు: శ్రీకృష్ణ ఆలయంలో..



వి.కోట : కృష్ణాష్టమి వేడుకల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



పలమనేరులో శ్రీకృష్ణుని ప్రతిమ ఊరేగింపులో చైర్‌పర్సన్

పుంగనూరు: శ్రీకృష్ణాష్టమి పండుగ పురస్కరించుకుని పట్టణ సమీపంలోని శ్రీకృష్ణ ఆలయంలో బుధవారం శ్రీకృష్ణుడి ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. యాదవ సంఘ నాయకులు వెంకటరెడ్డి యాదవ్, సుబ్రమణ్య యాదవ్, చంద్రారెడ్డి యాదవ్ ఆధ్వర్యంలో గోకులాష్టమి పూజలు ప్రారంభించారు. ఆలయాన్ని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయం వద్ద ప్రత్యేక హోమాలు చేశారు. అధిక సంఖ్యలో యాదవులు పాల్గొన్నారు. గురువారం కూడా వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఊరేగింపు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: స్థానిక షిర్డీసాయి విజయవాణి వాణి స్కూల్‌లో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోపికలు, కృష్ణుడి వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కోలాహలంగా ఉట్లోత్సవం నిర్వహించారు. కరస్పాండెంట్ విజయలక్ష్మి, మౌనిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సోమల: మండలంలో పెద్ద ఉప్పరపల్లెలోని శ్రీ కృష్ణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భారతి, పాదలగుంటపల్లె సర్పంచ్ జయరాం, సింగిల్‌విండో వైస్ చైర్మన్ గణపతి, వైఎస్సార్‌సీపీ నేత శీనయాదవ్, భక్తులు పాల్గొన్నారు.

కుప్పం నియోజకవర్గం

కుప్పం: కృష్ణాష్టమి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా గుడుపల్లె రోడ్డులోని శ్రీ కృష్ణార్జున దేవాలయంలో స్వామి వారికి ఉదయం ప్రత్యేకంగా అభిషేకం చేసి, పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. సాయంత్రం చిన్నారులను చిన్నికృష్ణుడి వేషధారణతో ఆలయానికి తీసుకుని వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలయ ధర్మకర్త దయానిధి అందజేశారు. అలాగే, సుజ్ఞానంద్ర ఆశ్రమంలో శ్రీకృష్ణుని ప్రతిమలను ఏర్పాటు చేసి జన్మాష్టమి వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. పలువురు భక్తులు దర్శించుకున్నారు.

పలమనేరు నియోజకవర్గం

పెద్దపంజాణి: మండలంలోని బొమ్మరాజుపల్లె వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే శంకర్రాయలపేటలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరినాథ్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు. కార్యనిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వి.కోట మండలంలో..

వి.కోట: పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రామాపురంలో ప్రబోధ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే మండల యాదవ సంఘం పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించింది. స్వామి వారిని, ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులను పుర వీధుల్లో కేరళ భజన మేళాలు, డప్పు, మంగళవాయిద్యాల హోరు నడుమ ఊరేగించారు.చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు.

వైభవంగా కృష్ణుని ఊరేగింపు

పలమనేరు: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా స్థానిక బసవన్న కట్టవీధిలోని శ్రీబసవేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీకృష్ణుని ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు కృష్ణుని వేషధారణలో అలరించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ హాజరయ్యారు. నిర్వాహకులు భాస్కర్, సరళ, వాణిశ్రీ, లత, రేణుక, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.



పెద్దపంజాణి: బొమ్మరాజపల్లెలో..



కుప్పం: కృష్ణార్జున దేవాలయంలో, సుజ్ఞానాంద్ర ఆశ్రమంలో..





వి.కోటలో ఊరేగుతున్న వేణుగోపాలస్వామి



చౌడేపల్లె : విజయవాణి స్కూలులో..

